క్లుప్తంగా

విద్యుత్ సమస్యలపై సమావేశం


వినతిపత్రం ఇస్తున్న వినియోగదారుడు

కోరుట్ల: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మీటర్ బిల్లింగ్, పేరు మార్పిడి, విద్యుత్ సరఫరాలో మార్పులు, కొత్త సర్వీసులు తదితర సమస్యలపై చర్చించారు. ఫిర్యాదులు స్వీకరించారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ కె.ఈశ్వరయ్య, అశోక్, కిషన్, భూమారెడ్డి, ఏడీఈలు ఆంజనేయరావు, రఘుపతి, మనోహర్, శ్రీనివాసరావు, శ్యామ్, సత్యనారాయణ, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న కృష్ణారావు

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ ఒక్క పథకం కూడా సరిగా అమలు కావడం లేదని టీపీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు బుధవారం కోరుట్లలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా కేసీఆర్ కిట్ అమలు కావటం లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన మహిళలకు కేసీఆర్ కిట్‌తో పాటు ఆడపిల్ల పుడితే రూ.13వేలు, అబ్బాయి పుడితే రూ.12వేలు ఇస్తామని చెప్పారు కానీ ఏడాదిన్నరగా ఇవ్వడం లేదన్నారు. దీంతో పాటు రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పథకాలన్నీ పేరు గొప్ప ఊరుదిబ్బ అన్న చందంగా మారాయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్‌గౌడ్, కొంతం రాజం, నాయకులు సత్యనారాయణగౌడ్, తుపాకుల భాజన్న పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల వసూలుపై ధర్నా


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధర్మపురి: గృహ వినియోగదారుల నుంచి అడ్వాన్స్ కంజక్షన్ డిపాజిట్ (ఏసీడీ) పేరుతో విద్యుత్ బిల్లులు వసూల్ చేయడాన్ని నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ధర్మపురిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు బెజ్జారపు లవన్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం రెండుసార్లు విద్యుత్ బిల్లులు పెంచి సామాన్యులపై అధిక భారం మోపారని మండిపడ్డారు. అనంతరం విద్యుత్ ఏఈ మనోహర్‌కు వినతిపత్రం సమర్పించారు. నాయకులు చంద్రశేఖర్, బండారు లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, నలుమాసు వైకుంఠం, దివిటి శ్రీధర్ పాల్గొన్నారు.

రాజారం ఇన్‌చార్జి సర్పంచ్‌గా లహరిక

ధర్మపురి: అనారోగ్యం కారణంగా 2వ తేదీ, డిసెంబర్, 2022న సర్పంచ్ పదవికి రాజానామా చేసిన రంగు మమత స్థానంలో ఉపసర్పంచ్‌గా ఉన్న బండారు లహరిక బాధ్యతలు చేపట్టాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా రాజారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం బండారు లహరిక ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఘనంగా ఎడ్లబండి పోటీలు


విజేతలను సన్మానిస్తున్న నాయకులు

పెగడపల్లి: మండలంలోని కోట్ల నందగిరి వీరభద్రస్వామి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఎడ్లబండి పోటీలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 20మంది పోటీదారులు పాల్గొన్నారు. పోటీలో రఘువీర్ అర్ధతులం బంగారం, నేరెళ్ల శేఖర్‌గౌడ్ 15 తులాల వెండి, పత్తిపాక మనోజ్ 10 తులాల వెండి గెలుచుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాజుల రాకేశ్, వైస్ఎంపీపీ గాజుల గంగాధర్, విండో చైర్మన్ కర్ర భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ అశోక్‌రెడ్డి, సత్యనారాయణరెడి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌చార్జిల పాలన ఇంకెన్నాళ్లు?

- మెట్‌పల్లి మున్సిపాలిటీలో కీలక పోస్టులు ఖాళీ
- దృష్టిసారించని పాలకవర్గం
- రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో కొరవడిన పర్యవేక్షణ


మున్సిపల్ కార్యాలయం

మెట్‌పల్లి: మున్సిపాలిటీలో కీలకమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి స్థానంలో చాలారోజులుగా ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. ఇక్కడ పనిచేసిన అధికారులు కొంతకాలానికి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తుండగా, వారి స్థానంలో తిరిగి ఎవరూ రావడం లేదు. దీంతో ఆయా స్థానాల్లో మరో మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న వారికి డిప్యూటేషన్‌పై విధులు అప్పగించడం, ఇక్కడ ఇతర విభాగాల్లో ఉన్నవారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. కీలకమైన పోస్టుల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. అయినా ఈ విషయంలో పాలకవర్గం చొరవ తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రెండున్నర నెలలుగా కమిషనర్ కుర్చీ ఖాళీ..

మున్సిపాలిటీలో ప్రధానమైనది కమిషనర్ పోస్టు. ఈ పోస్టు రెండున్నర నెలలుగా ఖాళీగా ఉంది. కమిషనర్‌గా ఉన్న సమ్మయ్య 2022 అక్టోబర్ 30న బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉండగా, మున్సిపల్ డీఈగా ఉన్న రాజ్‌కుమార్ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనకు అటు ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు ఇతర అన్ని విభాగాలను పర్యవేక్షించడం ఇబ్బందిగా మారింది.

మరికొన్ని కీలక పోస్టులు కూడా..

కమిషనర్ పోస్టే కాకుండా మరికొన్ని కీలక పోస్టులు కూడా చాలాకాలంగా ఖాళీగానే ఉన్నాయి. మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చేది టౌన్ ప్లానింగ్ విభాగం. ఇందులో ఒక్క రెగ్యులర్ అధికారి కూడా లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం టీపీఎస్‌గా ఉన్న సాయికృష్ణది కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పోస్టు కాగా, మెట్‌పల్లిలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. అలాగే నిజామాబాద్ కార్పొరేషన్‌లో టీపీవోగా ఉన్న రాజేందర్ కూడా ఇక్కడ డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. మరోవైపు ఈ విభాగంలో ఒక టీపీఎస్, రెండు టీపీబీవో పోస్టులు సైతం కొన్నేళ్లుగా భర్తీ కావడం లేదు. అధికారుల కొరతతో ఇంటి నిర్మాణాలపై పర్యవేక్షణ కొరవడడంతో చాలా చోట్ల అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.

పాలకవర్గం చొరవ తీసుకోవాలి

మున్సిపల్‌లో కీలక పోస్టులు ఖాళీగా ఉండడంతో పలు సేవలు సక్రమంగా అందడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ప్రధానమైన కమిషనర్ పోస్టు నెలల తరబడి ఖాళీగా ఉండడం పాలనా వ్యవహారాలపై ప్రభావం చూపుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. పాలకవర్గం చొరవ తీసుకొని ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కీలక పోస్టులు ఖాళీ



మున్సిపాలిటీలో కమిషనర్ పోస్టుతో పాటు పలు కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాలా కాలంగా రెగ్యులర్ అధికారులు లేకపోయినప్పటికీ వాటిని భర్తీ చేయకపోవడం సరికాదు. పాలకవర్గం, ఉన్నతాధికారులు రెగ్యులర్ అధికారులను నియమించేలా చర్యలు తీసుకోవాలి. – బొల్ల రమేశ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు

కంటి వెలుగుకు అంతా సిద్ధం


పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ హన్మండ్లు

రాయికల్: పట్టణంలోని ఒకటో వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని బుధవారం మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు పరిశీలించారు. పట్టణ ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ గండ్ర రమాదేవి, కమిషనర్ గంగుల సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

శిబిరానికి ఏర్పాట్లు పూర్తి

ధర్మపురి: మండలంలోని అన్ని గ్రామాల వారికి నిర్వహించే నేత్ర వైద్య శిబిరానికి అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరానికి మండలంలోని 25 గ్రామాల వారికి ధర్మపురిని వేదికగా ఏర్పాటు చేశారు. మొత్తం 15 వార్డులు ఉండగా ప్రతి వార్డులో తేదీల ప్రకారం నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు. ఏప్రిల్ 6 వరకు పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మల్యాల: ప్రతి ఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకునేలా ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలని ఎంపీడీవో శైలజారాణి, జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి పి.సురేశ్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని గొర్రెగుండం, మ్యాడంపల్లి గ్రామాల్లో ప్రారంభించే కంటి వెలుగు నిర్వహణ స్థలాన్ని వారు పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, మహిళా సంఘాల నాయకులు ప్రజలకు అవగాహన కల్పించి, కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొనేలా చేయాలని సూచించారు. సర్పంచులు సుంకె లచ్చయ్య, రౌతు గంగా మహేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

కేంద్రాల పరిశీలన

కథలాపూర్: మండలంలో గురువారం నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లను ఎంపీడీవో జనార్దన్ బుధవారం పరిశీలించారు. కథలాపూర్ పీహెచ్‌సీ పరిధిలో తక్కళ్లపెల్లి, అంబారిపేట పీహెచ్‌సీ పరిధిలో దూలూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కేంద్రాలకు వచ్చే ప్రజలకు అన్ని వసతులు సమకూరుస్తున్నట్లు ఎంపీడీవో జనార్దన్ పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీవో గంగాధర్ ఉన్నారు.

బైక్‌ర్యాలీని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గొలపల్లి: మండలంలోని 27 గ్రామాల్లో ఈనెల 22న ప్రజాగోస బీజేపీ భరోసా పేరుతో నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం కోరారు. ఆయన మాట్లాడుతూ బైక్‌ర్యాలీ మండలంలోని శ్రీరాములపల్లిలో ప్రారంభమై గొల్లపల్లి మండల కేంద్రంలో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ గడ్డం వివేకానంద పాల్గొంటారని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల మల్లేశం, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, స్వచ్ఛభారత్ రాష్ట్ర కన్వీనర్ మంచె రాజేశ్, జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, మండల ఇన్‌చార్జి కొక్కు గంగాధర్, మండల అధ్యక్షుడు కట్ట మహేశ్ పాల్గొన్నారు.

ఖమ్మం సభకు తరలిన నాయకులు

రాయికల్: ఖమ్మంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారీ బహిరంగ సభకు రాయికల్ మండలానికి చెందిన బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తలారి రాజేశ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు దొంతి నాగరాజు, కౌన్సిలర్ మహేశ్ గౌడ్, సర్పంచ్ బెక్కం తిరుపతి, పార్టీ నాయకులు లావుడ్య సురేందర్‌నాయక్, ఎలిగేటి అనిల్‌కుమార్ తరలివెళ్లారు.

పరిపాలన సంస్కరణలకు ఆద్యుడు ఎన్టీఆర్


జగిత్యాలటౌన్: నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా ఎన్టీఆర్ అమలు చేసిన పరిపాలన సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మహంకాళి రాజన్న కొనియాడారు. ఈ మేరకు బుధవారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని జగిత్యాల టవర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వైశ్యభవన్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అక్కినపెల్లి కాశీనాథం, కొండ శ్రీధర్, భార్గవరాం బత్తుల కొండయ్య, సోమ నారాయణరెడ్డి, నక్క లక్ష్మణ్, రవి తిరుపతి ఉన్నారు.

రాయికల్‌లో..

రాయికల్: టీడీపీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాతబస్టాండ్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు సోమ నారాయణరెడ్డి, సత్యం, సాయబ్, రాజేందర్‌గౌడ్, అశోక్, పారిపల్లి నారాయణ, కల్లెడ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. తెలుగు యువత నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జుల రమేశ్, రాధారపు దేవదాస్, పట్టణ ఉపాధ్యక్షుడు పోతాని సత్యం, వీడీసీ అధ్యక్షుడు నాంపెల్లి వెంకటాద్రి పాల్గొన్నారు.

ధర్మపురిలో..

ధర్మపురి: పట్టణంలోని నంది కూడలి వద్ద బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. సీనియర్ నాయకులు గడ్డం భాస్కర్‌రెడ్డి, సుధవేని నర్సాగౌడ్, ఉప్పుల రామకిష్టయ్య, బండారి రాజన్న,నాయకులు ఉపారపు రాజమల్లయ్య, కాశయ్య ఉన్నారు.

ప్రమాదకరంగా గుంత


మూలమలుపు వద్ద రోడ్డుపై గుంత

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేట నుంచి మెట్‌పల్లి వెళ్లే ఆర్అండ్‌బీ డబుల్‌రోడ్డులో వైఎస్ఆర్ అర్బన్‌కాలనీ మూలమలుపు వద్ద పెద్ద గుంత ఏర్పడింది. మూలమలుపు వద్ద గుంత ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. రాత్రిపూట ఈమార్గంలో బైక్‌లపై వెళ్లేవారు గుంతలో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే గుంతను పూడ్చివేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

✦ రైతు రుణమాఫీకి నాలుగు విడతలెందుకు?

మల్లాపూర్: ధనిక రాష్ట్రంలో రైతు రుణమాఫీకి నాలుగు విడతలు ఎందుకని కోరుట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద టీడీపీ జెండా ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు సాదుల్ల, నాయకులు పాల్గొన్నారు.

✦ గ్రామాభివృద్ధి సంఘం నూతన కార్యవర్గం

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామాభివృద్ధి సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా తీపిరెడ్డి రత్నాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎడ్మల బాపురెడ్డి, క్యాతం బుచ్చి గంగారెడ్డి, పన్నాల తిరుపతిరెడ్డి, గడ్డం గోపాల్, మిట్టపెల్లి జయంత్ రెడ్డి, కాటిపెల్లి లింగారెడ్డి, వెల్మ మాధవరెడ్డి, పన్నాల సంజీవ్‌రెడ్డి, నల్ల స్వామిరెడ్డి, వాకిటి నారాయణరెడ్డి, సింగిరెడ్డి ఎల్లారెడ్డి ఎన్నికయ్యారు.

✦ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

రాయికల్: మండలంలోని అల్లీపూర్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడిగా పోతు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా వేణు, మనోజ్, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్, సంయుక్త కార్యదర్శిగా విజయ్, కోశాధికారిగా హరీశ్, సోనును బుధవారం ఎన్నుకున్నారు.

✦ యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్‌యాదవ్

జగిత్యాలటౌన్: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గనవేని మల్లేశ్‌యాదవ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పలుమారు మల్లేశ్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడి అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని టౌన్ హాలులో జరిగిన అఖిల భారత యాదవ మహాసభ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభ జిల్లా ఉపాధ్యక్షులుగా చెరుకు మనోహర్‌యాదవ్, బండ మల్లేశ్‌యాదవ్, ఎరవేని లక్ష్మణ్‌యాదవ్, చెట్‌పల్లి అంజయ్య, జంగిలి కనకయ్య, జిల్లా అధికార ప్రతినిధిగా బర్కం మల్లేశ్‌యాదవ్, కార్యదర్శిగా ముక్కెర కుమార్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

✦ నియామకం

గొలపల్లి: అఖిల భారత యాదవ మహాసభ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆవుల సత్యం నియామకమయ్యారు. బుధవారం జగిత్యాలలోని టౌన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ను జిల్లా అధ్యక్షుడు రాజేశ్ నియామకపత్రం అందించారు.

అటెన్షన్ ప్లీజ్



నర్సింహులపల్లెలో తాగునీటికి కటకట

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లె గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో తాగునీటికి ఇబ్బందికరంగా మారింది. బస్టాండ్ ప్రాంతంలోని చేదబావుల్లో నీరు పూర్తిగా అడుగంటి చాలా వరకు ఎండిపోయాయి. దీనికి తోడు మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తాగునీటికి నానా తిప్పలు పడుతున్నారు. బస్టాండ్ ప్రాంతంలోని ప్రజలు ఒకే బోరింగ్ వద్ద ఇలా నీటికి ఇబ్బంది పడాల్సి వస్తోంది.

సంప్రదించాల్సిన అధికారిపేరు : మల్లారెడ్డి, ఎంపీడీవో, బీర్‌పూర్
ఫోన్ నంబర్ 98491 94556

మాస్టర్ ప్లాన్ అమలుపై ముందే సమాచారం ఇవ్వాలి


వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్: మున్సిపల్‌లో మాస్టర్ ప్లాన్ అమలుపై అఖిలపక్ష నాయకులకు ముందే సమాచారం ఇవ్వాలని బీజేపీ నియోజకవర్గ నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయికల్ మున్సిపల్ విస్తీర్ణంలో చిన్నదిగా ఉందని, జోన్లుగా విభజిస్తే పట్టణాభివృద్ధి దూరమవుతుందన్నారు. రైతులకు నష్టం కలగకుండా ముసాయిదా రూపొందించి ఆమోదించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, ప్రధాన కార్యదర్శి కుంబోజి రవి, ఉపాధ్యక్షుడు భూమేశ్, దళితమోర్చా అధ్యక్షుడు సంజీవ్, బీజేవైఎం అధ్యక్షుడు చిలువేరి ప్రవీణ్, నాయకులు బొమ్మకంటి రాంగోపాల్, కొడిమ్యాల రామకృష్ణ, బీమలింగం, భీమేశ్, కిశోర్, నరేశ్, సుమన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనానికి యత్నం


దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

కోరుట్ల: పట్టణంలోని బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు బుధవారం సాయంత్రం దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కాగా మంగళవారం కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఎమ్మెల్యే చేసిన వాఖ్యలకు నిరసనగా ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనానికి కాంగ్రెస్ నాయకులు యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కోరుట్ల అభివృద్ధికి కృషిచేసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మాజీ మంత్రి స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావుపై ఎమ్మెల్యే అనుచితంగా మాట్లాడటం సరికాదన్నారు. అదేవిదంగా టీపీసీసీ నాయకులు జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావుపై కూడా ఎమ్మెల్యే అనుచిత వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ తిరుమల గంగాధరగౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ రిజ్వాన్ పాషా, కార్యదర్శి మ్యాకల నర్సయ్య, ఎంబేరి సత్యనారాయణ, మైనారిటీ నాయకులు మహమ్మద్ సలీం, భారి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ వాసం అజయ్, ముజమ్మిల్, అష్రఫ్, వాజిద్, తహసీన్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి పట్టణంలో..

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ చౌరస్తాలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాజీ మంత్రి రత్నాకర్‌రావుపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో ఎమ్మెల్యే అనుచరులు ఇంటి నిర్మాణదారుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని, కోరుట్లలో ప్రభుత్వ భూములను విక్రయిస్తున్నారని విమర్శించారు. పట్టణాధ్యక్షుడు జెట్టి లింగంతో పాటు హఫీజ్, బెజ్జారపు శ్రీనివాస్, తుమ్మనపల్లి రాంప్రసాద్, దుర్గం శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న డా.సంజయ్

కోరుట్లరూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డా.కల్వకుంట్ల సంజయ్ బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం మండలంలోని గోధూర్, తిమ్మాపూర్, యామపూర్, ఇబ్రహీంపట్నం, వర్షకొండ, మూలరాంపూర్, వేములకుర్తి, డబ్బా, అమ్మక్కపేట గ్రామాలకు చెందిన 25 మంది లబ్దిదారులకు రూ.8.67లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి, బీఆర్ఎస్ యువ నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పంపిణీ చేశారు. అనంతరం ఇబ్రహీంపట్నం శివారులోని ధర్మసాగర్ కాలనీ వద్ద స్టేడియం నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. వైఎస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సర్పంచు నేమూరి లత, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకటి, ఎంపీటీసీలు తిమ్మణి రాములు, జైలేష్, మండల కోఆప్షన్ సభ్యుడు ఏలేటి చిన్నారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎలాల దశరత్‌రెడ్డి, నాయకులు నేమూరి సత్యనారాయణ, జాజాల జగన్‌రావు, జేడి సుమన్, పుప్పాల నర్సయ్య, నేరేళ్ల దేవేందర్, ఆనంద్, మహేశ్, దేవయ్య పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినికి సన్మానం

సారంగాపూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిని బుధవారం సన్మానించారు. గురుకుల విద్యాలయానికి చెందిన దూంపేట శ్రావణి (2021–22)లో పదో తరగతి ఫలితాల్లో 9.5 జీపీఏ మార్కులు సాధించింది. సారంగాపూర్‌కు చెందిన పురుమల్ల లక్ష్మారెడ్డి అనే రైతు శ్రావణికి రూ.2వేలు నగదు పారితోషికం అందించారు. అనంతరం విద్యార్థినిని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి సన్మానించారు. ప్రిన్సిపాల్ పురుమల్ల ప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్


విజేతకు బహుమతి ప్రదానం

కోరుట్లటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో కోరుట్ల కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. వారంరోజులుగా నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో బుధవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో కోరుట్ల, పెగడపెల్లి తలపడగా కోరుట్ల టీమ్ విన్నర్‌గా, పెగడపల్లి టీమ్ రన్నర్‌గా నిలిచాయి. పోటీల్లో జిల్లాలోని 10 టీమ్‌లు పాల్గొన్నాయి. కోరుట్ల కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ప్రైజ్‌మనీతో పాటు ట్రోఫీలు బహూకరించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు శికారి దత్తాద్రి, అంగరి వంశీకృష్ణ, కటుకం శివకుమార్, ఆయా మండలాల ఫొటో, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.